# గ్రామీణ క్రీడాకారులను గుర్తించాలి

- క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- గోమారంలో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు ప్రారంభం

శివ్వంపేట, సెప్టెంబర్ 12 : క్రీడలతో గ్రామాల్లోని యువకులు, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించొచ్చని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వ సహకారంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గోమారం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడంతో శరీరక ధృఢత్వంతో పాటు మానసికోల్లాసం, స్నేహభావం పెంపొందుతాయన్నారు. మండలంలోని 11 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. గతంలో ఎంతో మంది ప్రతిభావంతులను తయారుచేసిన గోమారం పాఠశాల అభివృద్ధికి, పక్కనే గల హాస్టల్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సింగరేణి సంస్థ నుంచి గత ప్రభుత్వంలో గోమారం ఉన్నత పాఠశాలకు మంజూరైన 25 లక్షల రూపాయల విడుదలకు కృషి చేస్తానన్నారు. అనంతరం క్రీడాకారులతో కలసి ఎమ్మెల్యే వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో తాజామాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సిలువేరి జ్యోతిఆంజనేయులు, ఎంఈఓ బుచ్యానాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు లాయక్, మాజీ సర్పంచులు బాలమణి నరేందర్, రంగీల ఆంజనేయులు, చంద్రకళ శ్రీశైలం, ఎస్జీఎఫ్ సెక్రటరీ గంగాల రమేశ్, యాదాగౌడ్, పెద్దపట్లోరి సుధీర్ రెడ్డి, వడ్ల భిక్షపతి చారి, ముత్యంరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాకేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింగ్, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాంపల్లి గోవర్దన్ రెడ్డి, రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శివ్వంపేట: వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



గోమారం ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతిగృహానికి 5క్వింటాళ్ల బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే

**పాలిటెక్నిక్ వసతిగృహానికి 5 క్వింటాళ్ల బియ్యం అందజేత**

గోమారంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతి గృహానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి 5 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. వసతి గృహంలో భోజనానికి సరిపడా బియ్యం అందుబాటులో లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్న విషయం ఎమ్మెల్యేకు తెలిసింది. దీంతో వెంటనే 5 క్వింటాళ్ల సన్నరకం బియ్యాన్ని పంపిణీ చేసిందని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేతో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, కుంట లక్ష్మణ్, గడ్డం ముత్యంరెడ్డి, రాకేష్‌రెడ్డి, శైలేందర్‌గౌడ్, షకీల్, సమీర్, రుషిత్‌రెడ్డి, నవీన్, నగేశ్ తదితరులు ఉన్నారు.

**రామాయంపేటలో మండల స్థాయి క్రీడలు**

రామాయంపేట, సెప్టెంబర్ 12: మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా పట్టణంలోని కళాశాల గ్రౌండ్‌లో గురువారం ఖోఖో ఆటల్లో 530 మంది జూనియర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ నాగరాజు తెలిపారు. మూడు రోజుల పాటు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ఆడుతారన్నారు. పీడీలు నాగచందర్, కిరణ్, సిద్ధరాములు, యాదగిరి, శోభ, గీత, విజయలక్ష్మి, లత పాల్గొన్నారు.

**విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎంఈవో**

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 12: విద్యార్థులు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈవో నీలకంఠం అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో మెదక్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించారు. మండలంలోని 22 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అందులో ప్రతిభ కనబర్చిన 40 మంది క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. శ్యామయ్య, రవి, పీఈటీలు కుమార్, పోచయ్య, రవి, లాజర్, శిల్ప, ప్రీతి, శ్వేత పాల్గొన్నారు.



రామాయంపేటలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 12: జిల్లా కేంద్రంలో విద్యుత్తు సరఫరాకు ముందస్తు జాగ్రత్తగా స్తంభాల మార్పు, తీగల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఏఈ జావెద్ తెలిపారు. పట్టణంలోని పిల్లిడ్డి, గ్రంథాలయం, బాలికల పాఠశాల, కోలిగడ్డ, బుస్సగడ్డ, అరబ్‌గల్లీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వివాహిత అదృశ్యం



శాంతి (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబర్ 12: వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిగూడ తండాలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారెడ్డిగూడతండాకు చెందిన అంగోత్ శాంతి (45) బుధవారం కూరగాయలు అమ్మడానికి వెళ్లి, సాయంత్రం వరకు నర్సాపూర్ మార్కెట్‌లో కూరగాయలు అమ్మింది. కాని రాత్రి ఇంటికి రాలేదు, ఫోన్ స్విచ్ఆఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో ఆమె భర్త ఆంగోత్ అమ్రు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ చోరీ

చేగుంట, సెప్టెంబర్ 12: రాత్రి వేళ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్ చోరీకి గురవుతున్న ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మక్కరాజిపేట రాయుని చెరువు తండా సమీపంలో జరిగింది. వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా కాకపోవడంతో చుట్టుపక్కల రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు గురువారం వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫారం కింది భాగాన ఉన్న పైపును కట్ చేసి అందులో ఉన్న రూ.40వేల విలువ గల 220 లీటర్ల ఆయిల్‌ను దొంగతనం చేశారు. ఇట్టి విషయమై పోలీసులు, విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు రైతులు తెలిపారు.



నిజాంపేట, సెప్టెంబర్ 12: అనాథ చిన్నారులు సుప్రియ, సుమశ్రీకి నిజాంపేట వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రూ.11 వేల నగదు, సంఘ సేవకుడు మోహన్‌నాయక్ రూ.10 వేలు ఫిక్స్ డిపాజిట్ బాండ్‌ను గురువారం అందజేశారు.

## చెరువుకు బుంగ పూడ్చిన అధికారులు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 12: మండలంలోని శాలిపేట నల్ల చెరువుకు బుధవారం బుంగపడి నీరు వృథాగా పోయింది. దీంతో గ్రామస్తులు, యువకులు ఇసుక బస్తాలను అడ్డుగా వేసి నీటి వృథాను అరికట్టగలిగారు. ఈ విషయం తెలుసుకున్న నీటి పారుదలశాఖ అధికారులు గురువారం బుంగను గ్రామస్తుల సహాయంతో పాక్షికంగా పూడ్చి వేయించారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్ పోయినది**

గారెల మాణెమ్మ, W/o. గారెల బాల్‌రాజ్, వయస్సు: 54 సంవత్సరాలు. R/o. H.No. 5-43, గ్రా. ఇంద్రకరణ్, మం. కంది, సంగారెడ్డి జిల్లా. సర్వే నం. 398/AA5 ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.3051/1995 మా స్వగ్రామం ఇంద్రకరణ్‌లో ఇల్లు మారుతున్న సమయంలో పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబరులో సంప్రదించగలరు.

గారెల మాణెమ్మ
సెల్:9640099993

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలి

### - కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఈనెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లను పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న జరగబోయే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లపై వివరించారు. ఈ వేడుకలకు కే.కేశవరావు రానున్నట్లు తెలిపారు. ఆ రోజున పాఠశాలలు, కార్యాలయాల్లో ఉదయం 9.30 గంటల వరకు జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. సమీకృత కలెక్టరేట్‌లో పది గంటలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, సందేశం, పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ప్రదర్శన ఉంటుందని కలెక్టర్ సూచించారు.

## తల్లి చితికి తలకొరివి పెట్టిన కూతురు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 12: మండల కేంద్రానికి చెందిన శ్యామల (35) కూలీ పనులు చేసుకుంటూ తన ఒక్క కూతురు లక్ష్మిని చదివించింది. భర్త బాలయ్య అనారోగ్యంతో ఐదేండ్ల కిందట మృతి చెందాడు. కూలినాలి చేస్తూ కూతురును జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదివిస్తున్నది. శుక్రవారం శ్యామల పని నిమిత్తం ఓ ద్విచక్రవాహన చోదకుడిని ఆపి, అతడి వాహనంపై మెదక్ వెళ్తుండగా ఖాజీపల్లి శివారు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్యామలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. గురువారం శ్యామల దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు లేకపోవడంతో కూతురు తల్లి చితికి కొరివిపెట్టింది. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి అనాథైన లక్ష్మి చదువుకు సాయం చేయాలని కుటుంబీకులు కోరుతున్నారు.



తల్లికి తలకొరివి పట్టిన కూతురు లక్ష్మి

## కాంగ్రెస్ గుండాయిజం చూస్తూ ఊరుకోం

శివ్వంపేట, సెప్టెంబర్ 12: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గుండాయిజం చేస్తున్నదని, ప్రజలు చూస్తూ ఊరుకోరని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ మండిపడ్డారు. గురువారం మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణతో కలిసి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై అరికెపూడి గాంధీ కొంతమంది కాంగ్రెస్ గుండాలతో దాడి చేయడం అప్రజాస్వామ్యమన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిలను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నాయకత్వంలో నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

## పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 12: పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. గురువారం మండలంలోని అంబాజిపేటలోని పండ్ల తోటను ఆయన పరిశీలించారు. పండ్ల తోటలను ఏర్పాటు చేసుకుంటే రైతులు సంవత్సరం పొడువునా లాభాలు ఆర్జించవచ్చని, దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ ప్రసాద్ ఉన్నారు.



పండ్ల తోటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

## పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

నర్సాపూర్, సెప్టెంబర్ 12: మండలంలోని చిప్పల్‌తుర్తి, ఆద్మాపూర్ గ్రామాల్లో నత్నాయిపల్లి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శోభ, ఏడీఏ సంధ్యారాణి గురువారం పర్యటించారు. కంది, వరి పంటలను పరిశీలించారు. వరికి కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు ఆశించినట్టు, కందిలో పైటోఫ్తోర ఎండు తెగులు గుర్తించినట్లు తెలిపారు. సందర్శనలో ఏవో దీపిక, ఏఈవో తేజస్విని, రైతులు పాల్గొన్నారు.



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

## రాజీయే రాజమార్గం: జిల్లా జడ్జి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 12: రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న జిల్లా న్యాయస్థానాల సముదాయం, నర్సాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా న్యాయవాదులు, స్టాడింగ్ కౌన్సిల్స్ చిట్ ఫండ్ కౌన్సిల్స్, ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్స్ సహకరించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 12: మండలంలోని టెంకటి గ్రామానికి చెందిన కె.దేవయ్య దవాఖానలో చికిత్స పొందాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి రూ.49,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోనం అంజయ్య, దుర్గయ్య, గడ్డం రాములు, కిష్టయ్య, అంజయ్య, శంకర్ తదితరులున్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలి: ఆర్డీవో

చేగుంట, సెప్టెంబర్ 12: విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం చేగుంట సమీపంలోని పలు పరిశ్రమల యజమానులతో తహసీల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. వడియారం బాలికల వసతి గృహంలో గదుల కొరత ఉండడంతో రేకుల షెడ్డుకు వారిని కొంత సాయం కోరారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో

## మాతా శిశు సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 12: మాతా శిశు సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఈసీడీఎస్ సీడీపీవో పద్మలత తెలిపారు. గురువారం మండలంలోని రామోజిపల్లి గ్రామంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నదన్నారు. ఈనెల ఆఖరు వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్ విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



రామోజిపల్లిలో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీడీపీవో పద్మలత

## ఎరువులు మోతాదుకు మించి వాడకూడదు

- రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- జిల్లా వ్యవసాయాధికారి గోవిందు

కౌడిపల్లి, సెప్టెంబర్ 12: పురుగు, తెగుళ్ల మందును మోతాదుకు మించి వాడకూడదని జిల్లా వ్యవసాయాధికారి గోవిందు తెలిపారు. గురువారం మండలంలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో 48 రోజులు జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ హైదరాబాద్, మెదక్ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పాదక పంపిణీదారుల డిప్లమా కోర్సుల్లో భాగంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను డీలర్లు రైతులకు సూచించాలన్నారు. ఎరువుల డీలర్లు వ్యవసాయంలో విత్తన దశ నుంచి పంట కోత వరకు పంటల్లో చీడపీడల నివారణకు ఉపయోగించే ఎరువులు, పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప, మేనేజ్ కన్సల్‌టెంట్ సుధారాణి, సహాయ వ్యవసాయ సంచాలకులు, రాష్ట్ర శిక్షణ అధికారిని సుమతి, ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయాధికారి స్వప్న, డీలర్లు ఉన్నారు. వారం రోజులుగా కురిసిన వర్షాల నేపథ్యంలో వివిధ పంటల్లో చీడపీడలు ఎక్కువ స్థాయిలో సోకే అవకాశం ఉన్నదని, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని డీఏఈ గోవింద్ తెలిపారు. గురువారం మండలంలోని తునికి గ్రామంలో పత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, ఏఈ స్వప్న జాదవ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు ఉన్నారు.



డీలర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



పులిమామిడి మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, సెప్టెంబర్ 12: మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన ముప్పిడి లింగయ్య, గుండబోయిన ప్రవీణ్, రమ్య కుటుంబ సభ్యులకు దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మూడు కుటుంబాలకు మంజూరైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

**బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ**

మండలంలోని పులిమామిడి మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి కూతురు రెండు రోజుల క్రితం మృతి చెందింది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నాయిని రాజ్‌గోపాల్, బాపురెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెట్టును బైక్ ఢీకొని వ్యక్తి మృతి

శివ్వంపేట, సెప్టెంబర్ 12: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని సికింద్లాపూర్ పంచాయతీ పరిధిలోని పిట్టలవాడకు చెందిన పిట్టల అజయ్ (30) కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం పని నిమిత్తం పిట్టలవాడ నుంచి నర్సాపూర్ బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దగొట్టిముక్ల శివారులోని రోడ్డుపై ఉన్న బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చిన అతడి బైకు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. దీంతో పొలాల్లోకి బైక్ దూసుకుపోయింది. అజయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 10 నిమిషాల్లో రూ.1.28 లక్షలు మాయం

నర్సాపూర్, సెప్టెంబర్ 12: ఓ కిరాణ దుకాణాదారుడి ఖాతాలోంచి 10 నిమిషాల్లో రూ.1.28లక్షలు మాయం చేసిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఇమ్మడి విశ్వనాథం బాలాజీ కిరాణ జనరల్ స్టోర్స్‌ను నడుపిస్తూ జీవిస్తున్నా. గతంలో భారత్ పే సౌండ్ బాక్స్ కోసం రూ.4 వేలు చెల్లించాడు. డబ్బులు చెల్లించినా వారు సౌండ్ బాక్స్ పంపించలేదు. భారత్‌పే వారితో ఫోన్‌లో మాట్లాడగా మీ డబ్బులు అకౌంట్‌లో వేశామని చెప్పారు. వారికి బ్యాంకు స్టేట్‌మెంట్ పంపించినా అక్కడి నుంచి స్పందన రాలేదు. బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి భారత్ పే టీషర్ట్ వేసుకుని విశ్వనాథం కిరాణ దుకాణానికి వచ్చాడు. దుకాణ యజమాని తన సమస్యను వచ్చిన వ్యక్తికి చెప్పగా, నీ ఫోన్ నుంచి మెస్సేజ్ పెట్టాలని చెప్పి అకౌంట్ నుంచి రూ.1 పంపించమని చెప్పాడు. అలా చెప్పడంతో తనకున్న అకౌంట్ నుంచి వేరొక అకౌంట్‌కు రూ.1 పంపించాడు. ఆ తర్వాత మెస్సేజ్ పెడతానని ఫోన్ తీసుకుని రూ.1 లక్ష క్రెడిట్ కార్డు నుంచి, రూ.28 వేలు అకౌంట్ నుంచి కాజేసి, అక్కడి నుంచి జారుకున్నాడు. వెంటనే 1930 సైబర్ క్రైమ్‌కు కాల్ చేయగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ వెళ్లి వివరాలు తెలపగా ఇది సైబర్ క్రైమ్‌కు సంబంధించిందని ఎలాంటి స్పందన ఇవ్వలేదని బాధితుడు వాపోయాడు. తిరిగి గురువారం పీఎస్‌కు వెళ్లగా కేసు నమోదు చేశారని తెలిపారు. సదరు వ్యక్తి అకౌంట్ సీజ్ చేసినట్లు తనకు మెస్సేజ్ వచ్చిందని విశ్వనాథం వెల్లడించారు. దుండగుడి కోసం గాలించినా దొరకలేదని దుకాణ యజమాని పేర్కొన్నాడు.

## సెల్‌ఫోన్ దొంగలు అరెస్ట్

### 17 సెల్ ఫోన్లు, రూ.5 వేల నగదు, కారు స్వాధీనం

తూప్రాన్, సెప్టెంబర్ 12: కారులో తిరుగుతూ రద్దీగా ఉండే ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు చోరీ చేసిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివానందం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావెల్లి గ్రామానికి చెందిన బానపురం రాజు తన ఫోన్‌ను తూప్రాన్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై శివానందం, పోలీసు బృందంతో తనిఖీలు చేశారు. ఇద్దరు పెద్దలు, ఇద్దరు పిల్లలు షిఫ్ట్ కారులో తూప్రాన్ బస్టాండ్ వద్ద గురువారం అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా డోన్ (నంద్యాల)కు చెందిన రవికుమార్‌గౌడ్, కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన అరవింద్, మరో ఇద్దరు బాలురతో కలిసి పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను దొంగలిస్తున్నట్లు నేరాన్ని అంగీకరించారు. వీరు దొంగలించిన సెల్‌ఫోన్‌లను ప్రభు అనే ప్రధాన నిందితుడికి విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. నలుగురిని పట్టుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. షిఫ్టుకారు, 17 సెల్‌ఫోన్లు, రూ. 5 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 12: చేపల వేటకు వెళ్లిన యువకుడు చెరువులోని వలలో చిక్కుకుని మృతి చెందిన ఘటన మండలంలోని శాలిపేటలో గురువారం జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజాపూర్‌కు చెందిన వెంకట్(37) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం చేపల వేటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. వెంకట్ అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టు పరిసర ప్రాంతాలలో చెరువుల వద్ద గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గురువారం ఉదయం శాలిపేటలోని నల్ల చెరువులో వెంకట్ మృతదేహం నీటిపై తేలడాన్ని అటుగా వెళ్లిన రైతు గమనించాడు. గ్రామస్తులు తెప్పల సహాయంతో వెంకట్ మృతదేహాన్ని బయటకు తీశారు. చేపల కోసం ఏర్పాటు చేసిన వలలో చిక్కుకుని వెంకట్ మృతి చెందాడు. మృతుడికి భార్య రేఖ, కూతురు దీక్షిత ఉన్నారు. మృతదేహ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

## పొజిషన్‌లో ఉన్న రైతులకు న్యాయం చేయాలి

శివ్వంపేట, సెప్టెంబర్ 12: పొజిషన్‌లో ఉండి రిజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని భూ నిర్వాసితులు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డిని వేడుకున్నారు. గురువారం తహసీల్ కార్యాలయంలో పోతుల బోగూడ, ఉసిరికపల్లి గ్రామాల రైతులతో ఆర్డీవో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పొజిషన్‌లో ఉన్న తమకు టైటిల్ లేక ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో న్యాయం చేయాలని కోరారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ బాధితులందరికీ న్యాయం చేస్తామన్నారు. పోతులబోగూడ గ్రామ శివారులో సర్వేనెంబర్ 195, 196, 197, 198, 201, 207, 208, 246, 248, 252, 253, 254, 256 సర్వేనంబర్లలో 44ఎకరాలు, ఉసిరికపల్లి శివారులో సర్వేనెంబర్ 248, 249లో 16 ఎకరాల భూమి కోల్పోతున్న రైతులు పొజిషన్‌లో ఒకరు, టైటిల్‌లో మరొకరు ఉన్నారన్నారు. రైతుల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. పొజిషన్‌లో ఉన్న రైతులకు టైటిల్ అందించి, టైటిల్ ఉన్న రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్డీవోతో తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐలు కిషన్, సునీల్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి సమస్యలు చెబుతున్న రైతులు


**యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

**వేలం కోసం బహిరంగ ప్రకటన**
**తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన**

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **23 సెప్టెంబర్ 2024**న మ. **12.30** గం. నుండి మ. **3.30** గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

**రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:**

| క్ర.సం. | బ్రాంచ్ పేరు | రుణ A/c నం. | వినియోగదారు పేరు | బకాయి మొత్తం | డిమాండ్ నోటీస్ తేది | స్థూల బరువు | నికర బరువు |
|---|---|---|---|---|---|---|---|
| 1 | జహీరాబాద్ | xxxxxxxxxxx2312 | S ప్రభాకర్ రెడ్డి | 1051235 | 04-ఆగస్టు-24 | 309.6 | 279 |
| 2 | జహీరాబాద్ | xxxxxxxxxxx1302 | చిందనూరి విశాల్ రెడ్డి | 166406 | 04-ఆగస్టు-24 | 35.2 | 32.7 |
| 3 | జహీరాబాద్ | xxxxxxxxxxx7164 | సాయి రెడ్డి మేఘమాల | 1550825 | 04-ఆగస్టు-24 | 375.7 | 336 |
| 4 | జహీరాబాద్ | xxxxxxxxxxx7171 | సాయి రెడ్డి మేఘమాల | 1213968 | 04-ఆగస్టు-24 | 312.1 | 263 |
| 5 | జహీరాబాద్ | xxxxxxxxxxx0099 | కొలన్ నారాయణ రెడ్డి | 172704 | 15-మార్చి-24 | 39.9 | 38.9 |
| 6 | సిద్దిపేట | xxxxxxxxxxx4591 | బర్రెంకల స్వామి | 117739 | 05-ఆగస్టు-24 | 31.3 | 30.3 |
| 7 | సిద్దిపేట | xxxxxxxxxxx5082 | ముస్కాన్ పేట బాబు | 182609 | 04-ఆగస్టు-24 | 36.3 | 35.5 |
| 8 | సిద్దిపేట | xxxxxxxxxxx4053 | గొట్టె ప్రభాకర్ | 43951 | 04-ఆగస్టు-24 | 10.4 | 9.7 |
| 9 | సంగారెడ్డి | xxxxxxxxxxx8453 | నీరుడి జైభవాని శంకర్ | 168780 | 07-జూన్-24 | 36.5 | 33.9 |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అధారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. **12.30** గం. నుండి మ.**3.30** గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

**అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**